ప్రజాశక్తి

శుక్రవారం 6 డిసెంబర్ 2024 8 పేజీలు


గుంటూరు



పల్నాడు

జనం కోసం సిపిఎం నిత్య పోరాటం

- నేటి నుంచి సిపిఎం పల్నాడు జిల్లా మహాసభ
- నేడు నరసరావుపేటలో ర్యాలీ, బహిరంగ సభ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సిపిఎం పల్నాడు జిల్లా మహాసభ శుక్ర, శని, ఆదివారాల్లో నరసరావుపేటలో జరగనున్నాయి. తొలిరోజైన శుక్రవారం ఉదయం 10 గంటలకు కోట సెంటర్ నుంచి పల్నాడు బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శన జరగనుంది. 11 గంటలకు నరసరావుపేట పల్నాడు బస్టాండ్ సెంటర్‌లో జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అధ్యక్షతన బహిరంగ సభ జరగనుంది. సభలో రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్. బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, కె.హరికిషోర్ పాల్గొంటారు. 7,8 తేదీల్లో నరసరావుపేట షాదిఖానాలో ప్రతినిధుల సభ నిర్వహించారు.



2021 అక్టోబరు 26, 27 తేదీల్లో జరిగిన పల్నాడు జిల్లా సిపిఎం మహాసభ తరువాత గత మూడేళ్ల కాలంలో అనేక పోరాటాలు జరిగాయి. వరికపూడిశల ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని పలు ఆందోళనలు నిర్వహించారు. యడవల్లి భూములకు సంబంధించి దళితుల భూములు బడాబాబులు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ వివిధ రూపాల్లో పోరాటాలు నిర్వహించారు. ఈ భూములు బలవంతంగా లాక్కోవడంపై 2015 నుంచి ఇప్పటి వరకు ఆందోళనలను కొనసాగించారు. కల్తీ విత్తనాల సమస్యపై పెదకూరపాడు నియోజకవర్గంలో పలు ఆందోళనలు నిర్వహించారు. జిల్లాలో ఆందోళనల నేపథ్యంలో గత మూడేళ్లలో సిపిఎం నాయకులు, కార్యకర్తలపై 14 కేసులు నమోదయ్యాయి. నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దులో సుదీర్ఘపోరాటం చేసిన రైతులకు సంఘీభావంగా పల్నాడు జిల్లా వ్యాప్తంగా సిపిఎం పలు ఆందోళనలు నిర్వహించింది. ప్రదర్శనలు నిర్వహించారు. ట్రాక్టరు ర్యాలీలు చేపట్టారు. పల్నాడు జిల్లా నుంచి గుంటూరు, విజయవాడ వరకు ర్యాలీలు కొనసాగించారు. అంగన్ వాడీ కార్యకర్తల 42 రోజుల సమ్మెలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు సంపూర్ణ మద్ధతు తెలిపి క్షేత్రస్థాయిలో వారికి అండగా నిలిచారు. సిపిఎస్ రద్దు కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు నిర్వహించిన చలో విజయవాడ ర్యాలీకి మద్ధతుగా జిల్లాలో ప్రదర్శనలు చేశారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల, క్రోసూరు మండలం దొడ్లేరులో బ్యాంకుల్లో రుణాల కోసం బ్యాంకుల్లో తనఖా పెట్టిన బంగారం మాయం కావడంపై ఆందోళనలు నిర్వహించారు. ప్రజలకు బ్యాంకుల నుంచి వారి బంగారం వారికి ఇప్పించడానికి కృషి చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా పలు మార్లు ఆందోళనలు నిర్వహించారు.

అభివృద్ధిలో వెనుకబాటు

పల్నాడు జిల్లాలో ఆశించిన అభివృద్ధి జరగడం లేదు. 1996 నుంచి 2024 వరకు ముగ్గురు ముఖ్యమంత్రులు, మంత్రి నారా లోకేష్ వేర్వేరుగా నాలుగు సార్లు వరికపూడిశెల ఎత్తిపోతలకు శంకుస్థాపన చేసినా ఇంత వరకు ముందుకు కదలలేదు. గతేడాది నవంబరు 15న అప్పటి సిఎం జగన్ శంకుస్థాపన చేసి వెంటనే పనులు ▶ 2లో

మిర్చి యార్డును ప్రక్షాళన చేస్తాం

- త్వరలో మార్కెట్ కమిటీ ఏర్పాటుకు చర్యలు
- బయటవ్యక్తుల ప్రమేయం వల్లే సమస్యలు పెరిగాయి
- వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి


మంత్రి అచ్చెన్నాయుడ్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు రామాంజనేయులు, నశీర్, గల్లా మాధవి

గుంటూరు మిర్చి యార్డును పాలనపరంగా ప్రక్షాళన చేస్తామని, త్వరలో మార్కెట్ కమిటీని నియమిస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, పశు సంవర్ధక శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక చుట్టగుంట సెంటర్‌లోని మార్కెటింగ్ శాఖ కమిషనర్ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో మంత్రి గురువారం సమీక్షించారు. మిర్చి యార్డ్‌పై రైతులు, అధికారులు, ఎగుమతి, దిగుమతి దారులు, వేమెన్స్‌తో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ యార్డులో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కరించి రైతులకు మేలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మిర్చి యార్డులో రానున్న మూడు నెలల్లో వచ్చే మిర్చి టిక్కీలను దృష్టిలో పెట్టుకుని రైతులకు సమస్యలు లేకుండా మిర్చి అమ్మకాలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లుగా సంబంధం లేని వ్యక్తులను మిర్చి యార్డులోకి తెచ్చి ఇక్కడ వ్యవస్థలన్నిటినీ నాశనం చేసిందన్నారు. యార్డులో కమీషన్ ఏజెంట్ల లైసెన్సులు జారీ విధానాన్ని సమీక్షించి మార్పులు చేస్తామని చెప్పారు. 687 కమీషన్ ఏజెంట్ల లైసెన్సులను పూర్తిస్థాయిలో పరిశీలించి నిబంధన మేరకు వ్యాపారం చేయని వారిని గుర్తించి రద్దు చేస్తామన్నారు. రవాణా కమిషనర్‌తో చర్చించి మిర్చి రవాణా చేసే వాహనాల ఛార్జీలపై ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మిర్చి యార్డులో ఈ-నామ్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేస్తామని, వేమెన్ల సమస్యను పరిష్కరిస్తామన్నారు. యార్డులో మౌలిక సౌకర్యాలు పూర్తిస్థాయిలో మెరుగుపరుస్తామని, క్లీనింగ్, లైటింగ్ తాగునీటి సరఫరా మెరుగుపరుస్తామని ▶ 2లో



8లో

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాలు

ఉపాధ్యాయుని మృతి ఘటనపై ఫ్యాప్టో నిరసన


2లో

విలేకర్లకు వివరాలు వెల్లడిస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

7న మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ : జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

రూ.6.83 లక్షల ఎరువులు, పురుగు మందులు సీజ్ 2పేజీ

అదనపు భారం అధికం!

- వినియోగం కంటే ఇతర ఛార్జీలే ఎక్కువ
- సర్దుపోటుతో వినియోగదారుల విలవిల
- వైసిపి బాటలోనే కూటమి ప్రభుత్వం బాదుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ ఛార్జీల పెంపుదల కొనసాగుతోంది. విద్యుత్ ఛార్జీలపై అదనపు భారం మోపుతూ వివిధ రూపాల్లో పెరిగిన ఛార్జీలతో జారీ చేసిన బిల్లులు గత రెండ్రోజులుగా వినియోగదారులకు అందుతున్నాయి. తాము అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలను పెంచబోమని ప్రజాగళం సభల్లో ఊదరగొట్టిన చంద్రబాబు విద్యుత్ రెగ్యులేటరీ అథారిటీ ఇచ్చిన నివేదికకు అనుగుణంగా సర్దుభాటు పేరుతో ఛార్జీల పెంపునకు పచ్చజెండా ఊపడంతో ప్రజలు దొందూ దొందే అన్న భావనతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి విద్యుత్ బిల్లులకు వినియోగదారులకు అందుతున్నాయి. మీటర్ రీడింగ్ తీసి అపరేటర్లు ఇస్తున్న బిల్లులను చూసి వినియోగదారులు షాక్ అవుతున్నారు. ఇప్పటికే రెండు పద్ధతుల్లో అమలులో ఉన్న ట్రూఅప్, అదనపు సర్ధుబాటు ఛార్జీలకు అనుగుణంగా ప్రతి బిల్లుకు రూ.90 నుంచి రూ.350 వరకు అదనం భారం పడుతోంది. గుంటూరు ఎటి అగ్రహారం ప్రాంతానికి చెందిన షేక్ కరిముల్లా అనే వ్యక్తికి మొత్తం 9 యూనిట్లు మాత్రమే వినియోగించగా బిల్లు మాత్రం అదనపు సర్దుబాటు చార్జీలతో కలిపి రూ.397 వచ్చింది. నరసరావుపేటకు చెందిన మరో వినియోగదారుడికి గత నెలలో 162 యూనిట్ల సగటు వినియోగానికి రూ.1032 బిల్లు రాగా ఈ నెలలో తిరిగి 162 యూనిట్లకు రూ.1270 బిల్లు వచ్చింది. 36 నెలల పాటు వసూలు చేసే ట్రూఅప్ 29వ వాయిదా భారం ఈనెలలో కొనసాగింది. ఎఫ్.టి.పి.సి.ఏ చార్జీలు 4/22, 10/24 చార్జీలు కూడా అదనంగా జతయ్యాయి. దీంతో ప్రతి బిల్లుకు అదనపు భారం తప్పడం లేదు. మరోసారి ▶ 2లో


Meter Seals 000000,...
Bill Method SL-IrDA
CONTRACTED LOAD 5KW
CONNECTED LOAD 5KW
PURPOSE OF SUPPLY NA
CATEGORY DESC DOMESTIC (A)
CAT:1 SUB CAT:1 PH :3

	PRESENT	PREVIOUS
MTR STATUS	01	01
KWH	14565	14371
KVAH	14883	14688
SOLAR	0	0

BILLING PERIOD Nov 24 - Dec 24
OLD MTR KWH 0
OLD MTR KVAH 0
BILLED UNITS 194 Kwh/195 Kvah
AVERAGE UNITS 162
SOLAR EXPORT UNITS 0
NET UNITS 0
Bill Type KWH BILLING
Metering Type LT SIDE
RECORDED M.D : 2.72kVA MF :1.00
BILLED M.D :5.00 KVA PF :0.99

MIN/ENERGY CHRGS	831.00
FIXED CHARGES	50.00
CUSTOMER CHARGES	50.00
ELECTRICITY DUTY	11.64
INTEREST ON ED	0.00
SURCHARGE	0.00
GRID CHARGES	0.00
SHORT FALL	0.00
OTHER CHARGES	0.00
ADJUSTMENTS	0.00
TRUE-UP (29/36)	68.12
FPPCA Charges (04/22)	183.28
FPPCA Charges (10/24)	76.40
Loss/Gain (+ / -)	-0.44
GOVT SUBSIDY	0.00
BILL AMT	1270.00
ARREARS	0.00
TOTAL DUE	1270.00
ACL Demand	0.00
ACD Amount	0.00
DueDate/Arr.Pending	20/Dec/2024

మిర్చి యార్డును ప్రక్షాళన చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. వివిధ కారణాలతో మిర్చి ఎగుమతులు తక్కువగా ఉండటం వల్ల ధరలు స్థిరంగా లేవన్నారు. మిర్చి యార్డుకు అనుబంధంగా మిర్చి వ్యాల్యూ యాడెడ్ ఉత్పత్తులు తయారీకి ఎంఎస్ఎంఈ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకంను కేంద్ర ప్రభుత్వం రూ.6000, రాష్ట్ర ప్రభుత్వం రూ.14,000తో కలిపి మొత్తం రూ.20 వేలు అందించేలా త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు

. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ మిర్చి యార్డులోని సమస్యలన్ని పరిష్కరించి రైతులకు మంచి ధరలు కల్పించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యాపారులు కృషి చేస్తారన్నారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ మిర్చి యార్డులో నిబంధనలకు విరుద్ధంగా గత ప్రభుత్వం కమిషన్ ఏజెంట్లకు లైసెన్స్ మంజూరు చేశారని, మచ్చు, కటింగ్ పేరుతో దోపిడీ చేస్తున్నారని, సకాలంలో కొనుగోలు చేసిన మిర్చికి నగదు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నాలుగు శాతం కమీషన్ వసూలు చేస్తున్నారని, విజిలెన్స్ కమిటీలో నివేదిక ఆధారంగా ప్రభుత్వానికి రూ.365 కోట్లు ఆదాయం నష్టం జరిగిందని తెలిసిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు నగదు చెల్లించకుండా ఐపీ పెట్టిన కమీషన్ ఏజెంట్లు, వారికి అనుమతి మంజూరు చేసిన ఉద్యోగుల నుంచి రెవెన్యూ రికవరీ యాక్ట్ ద్వారా నగదు వసూలు చేసి రైతులకు ఇవ్వాలన్నారు. పాత కోల్డ్ స్టోరేజీలకు అగ్నిమాపక శాఖ రెన్యూవల్‌కు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో జరిగిన అవకతవకలుపై విజిలెన్స్ కమిటీ నివేదిక అధారంగా బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇటువంటి అవకతవకలు పునరావృతం కాకుండా పటిష్ట విధానాన్ని అమలు చేయాలన్నారు. వేమెన్స్ కి సంబంధించిన అంశాలను సానుకూలంగా పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ మిర్చి సరుకు రవాణాకు సంబంధించి లారీ యూనియన్ గుత్తాధిపత్యాన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత, సంయుక్త కలెక్టర్, మార్కెట్ యార్డు పర్సన్ ఇన్‌ఛార్జి ఎ.భార్గవతేజ, జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, విజిలెన్స్ జెడి రాజశేఖర్, మిర్చియార్డు కార్యదర్శి ఆంజనేయులు, ఎగుమతి, దిగుమతి వ్యాపారులు, రైతులు, వేమెన్స్ పాల్గొన్నారు.

అదనపు భారం అధికం!

(మొదటి పేజీ తరువాయి)

అదనపు సర్ధబాటు పేరుతో భారం కొనసాగింపును ప్రజలు తప్పుపడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.7912 కోట్లు వినియోగదారులపై భారం పడనుంది. ఇందులో ఉమ్మడి జిల్లాపై రూ.650 కోట్ల వరకు భారం వేయనున్నారు. గతంలో బిల్లులు చెల్లించిన వినియోగానికి మళ్లీ బిల్లులు వసూలు చేయడం గత ఐదేళ్లుగా పరిపాటిగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 18 లక్షల మంది వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల భారం పడుతోంది.

వైసిపి హయాంలో ట్రూ అప్ ఛార్జీలతో పాటు అదనపు సర్ధుబాటు ఛార్జీల వసూలును తప్పుపట్టిన నేతలే ఇప్పుడు విద్యుత్ పంపిణీ సంస్థలు ఇచ్చిన నివేదికలను ఆమలుకు పూనుకున్నాయి. విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా ఇప్పటికే వామపక్షాలు ఆందోళనకు పూనుకున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెలలో వైసిపి కూడా నిరసనలు తెలపాలని నిర్ణయించింది. విద్యుత్ పంపిణీ సంస్థలకు నష్టాలు వస్తే ప్రభుత్వం భరించడం 2014 వరకు అమలు జరిగింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ఇందుకు భిన్నంగా నష్టాలను ప్రజలపై వేర్వేరు రూపాల్లో చెల్లించిన బిల్లులకే మళ్లీ వసూలుకు శ్రీకారం చుట్టింది. ఇదే పద్ధతిని కూటమి ప్రభుత్వం కూడా ప్రజలపై భారం మోపేందుకు మొగ్గుచూపుతూ గత ప్రభుత్వ విధానాలనే కొనసాగిస్తుందని ప్రజల్లో అసంతృప్తి ఏర్పడింది. 2014 నుంచి 2019 మధ్య టిడిపి ప్రభుత్వ నిర్వాకం వల్లే తాము అదనపు భారం వేయాల్సి వస్తుందని వైసిపి నేతలు ఆరోపణలు చేసేవారు. ఇప్పుడు వైసిపి ప్రభుత్వ నిర్వాకం వల్లే ఛార్జీల సర్దుబాటు (పోటు)ను అమలు చేయాల్సి వస్తోందని కూటమి ప్రభుత్వం చెబుతోంది.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

7న మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ : జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో శుక్రవారం నుండి వచ్చేనెల 8వ తేదీ వరకూ నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. గురువారం కలక్టరేట్‌లో రెవెన్యూ సదస్సులు, 7న మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్ ఏర్పాట్లపై కలెక్టర్ నాగలక్ష్మి విలేకరుల సమావేశంలో వివరించారు. గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల్లో రైతులు, భూ యజమానుల ధ్రువపత్రాలు పరిశీలించి సరిగ్గా ఉన్నాయో లేదో చూసి పరిష్కరించటానికి రెవెన్యూ సదస్సులు తోప్పడతాయన్నారు. మండలంలో రోజుకు ఒక గ్రామంలో ఒక సభ ఏర్పాటు చేసి, ఉదయం 9 గంటల నుండి సాయంత్రం వరకూ సిబ్బంది అదే గ్రామంలో ఉండి, రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారినికి చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. రెవెన్యూ శాఖతోపాటు సర్వే, రిజిస్ట్రేషన్, కొన్ని ప్రాంతాల్లో దేవాదాయ శాఖ, వక్ఫ్‌బోర్డు సిబ్బంది, అటవీశాఖ, పంచాయతి, మున్సిపల్, పోలీసు సంబంధించి అర్జీలు వచ్చే అవకాశం ఉన్నందున ఆయా శాఖల సమన్వయంతో సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. అన్ని శాఖల నుండి గ్రామ సభకు అధికారులను నియమించామన్నారు. ముందుగానే ఆ గ్రామానికి సంబంధించి రెవెన్యూ రికార్డులను, అడంగళ్, 22 -ఎ లిస్ట్, హౌసింగ్, అసైన్డ్ ల్యాండ్ సమాచారం, సబ్ డివిజన్ సమాచారం తయారు చేసి గ్రామాల్లోకి తీసుకువెళ్తారనానరు. గ్రామంలోని సమాచారం సరిగ్గా వుందో లేదో ఈ రికార్డులతో చెక్ చేసుకోవచ్చన్నారు. రైతులు, ఇతర ల్యాండ్ యజమానులు వారి రికార్డులతో సరిచూసుకొని ఏమైనా తేడాలుంటే గ్రామ సభలో అక్కడిక్కడే పరిష్కరిస్తారని తెలిపారు. గ్రామసభ జరిగే గ్రామంలో ఆ రోజుకు సబ్ డివిజన్, మ్యూటేషన్ కోసం డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదని, రైతులెవరికైనా సమస్యలుంటే ఆ రోజు వరకు ఉచితంగా సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచే లక్ష్యంతో ఈనెల 7వ తేదీన మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్యాల్లోని 1064 పాఠశాల్లో ఈ మీటింగ్‌లు నిర్వహించటానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఈ మీట్‌లో విద్యార్థి చదువు విషయంలో, ఇతర అంశాల్లో ఏవిధంగా ఉన్నాడో తల్లిదండ్రులు నేరుగా ఉపాధ్యాయులతో మాట్లాడి తెలుసుకోవచ్చన్నారు. గడిచిన ఆరు నెలల కాలంలో విద్యార్థి ప్రగతికి సంబంధించిన ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందిస్తారని, దీంతో పాటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ప్రజాప్రతినిధులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు, తల్లిదండ్రులతో కలిసి సమావేశం ఉంటుందని తెలిపారు. అనంతరం పిల్లలకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పిల్లల తల్లితండ్రులకు కూడా అందిస్తారన్నారు. పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రుల అభిప్రాయాలు, సూచనలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, డిఆర్‌ఒ ఎన్.ఎస్.కె. ఖాజవలి, డిఇఒ సి.వి.రేణుక పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలి

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం శుక్రవారం నుంచి అన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులను సమన్వయం చేసుకుంటూ దిగ్విజయంగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యా చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి వెల్ఫేర్ డెవల్మేంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్యతో కలిసి రెవెన్యూ సదస్సుల నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామ మ్యాపులను ప్రభుత్వ భూములను వివిధ రంగుల్లో మార్కింగ్ చేసి గ్రామాలలో ప్రస్ఫుటమైన ప్రదేశములలో ఉంచాలన్నారు. 33 రోజులపాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించి, తర్వాత 45 రోజులలో సదరు సమస్యలపై స్పీకింగ్ ఆర్డర్ ఇవ్వాల్సి ఉందన్నారు. సదస్సులో ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ నందు నమోదు చేయాలన్నారు. సమావేశంలో కెఆర్‌ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ జిల్లా రిజిస్ట్రార్ డి.శైలజ, ఆర్‌డిఒ శ్రీనివాసులు పాల్గొన్నారు.



యాప్‌లతో మానసిక ఒత్తిడి : యుటిఎఫ్

ప్రజాశక్తి-ఈపూరు

ప్రభుత్వ పాఠశాలల్లో వినియోగించే యాప్‌లతో ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, వాటిని తగ్గించాలని యుటిఎఫ్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 రోజుల పదవ తరగతి షెడ్యూల్‌కు సంబంధించి సంక్రాంతి సెలవులను తగ్గించడం ఆదివారాలను పని దినాలుగా మార్చడం ఉపాధ్యాయుల సెలవు దినాలను తగ్గించి చూపిస్తూ ఇబ్బందులు గురిచేయడాన్ని యుటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంఇఒ రామతులసికి అందజేశారు. యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు పి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పి.జ్యోతిష్ కుమార్, సీనియర్ నాయకులు టీవీ సత్యనారాయణ, డి.సాంబశివరావు, జి.శ్రీనివాసరావు, జి.రామారావు, డి.మస్తాన్ ఎస్‌కె.బాజీ, ఎ.ఆంజనేయులు పాల్గొన్నారు.



రూ.6.83 లక్షల ఎరువులు, పురుగు మందులు సీజ్

ప్రజాశక్తి - నూజెండ్ల

పురుగుమందులు, ఎరువుల విక్రయాలపై విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. నూజెండ్ల మండలం మూర్తిజాయపురంలో హరిణి ఫర్టిలైజర్స్ షాపులో తనిఖీలు చేయగా అనుమతులు లేకుండా ఎరువులు, పరుగు మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. షాపులో పురుగుమందులు, ఎరువులు ఇన్వాయిస్లను, రిజిస్టర్లు, లైసెన్సులను పరిశీలించగా సరైన అనుమతి పత్రాలు లేవని నిర్ధారణకు వచ్చారు. అనుమతులు లేకుండా ఎరువులు పురుగు మందులు విక్రయిస్తున్న హరిణి ఫర్టిలైజర్స్ షాప్ యజమానిపై 6ఎ కేసు నమోదు చేయడంతో పాటు రూ.6.83 లక్షల సరుకును సీజ్ చేశారు. తనిఖీల్లో రీజినల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి చల్లగుండ్ల ఆదినారాయణ, ఎన్ఫోర్స్మెంట్ వ్యవసాయ శాఖ అధికారులు, నూజెండ్ల మండల వ్యవసాయ అధికారి సుగుణ బేగం పాల్గొన్నారు.

జనం కోసం సిపిఎం నిత్య పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభిస్తామని అప్పటి మాచర్ల సభలో ప్రకటించినా ఇంత వరకు పురోగతి లేదు. ఈ పథకంపై సిపిఎం పలు మార్లు వివిధ ధశల్లో ఆందోళనలను చేపట్టింది. 2022 ఏప్రిల్ 2న పల్నాడు జిల్లా ఏర్పడినా ఇంత వరకు ప్రభుత్వ కార్యాలయాలకు మౌలిక వసతులు సమకూరలేదు. ప్రభుత్వ పరంగా వైద్య సదుపాయాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదు. నర్సరావుపేటలో 200 పడకల ఆస్పత్రి అందుబాటులోకి వచ్చినా మాచర్ల, గురజాల, పెదకూరపాడు, వినుకొండ తదితర నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యశాలలు, పిహెచ్‌సిలు, ఇతర ఆస్పత్రుల్లో వసతులు మెరుగుపడ లేదు. విద్యాపరంగా ఈ నాలుగు నియోజకవర్గాల్లోని గ్రామీణ విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లక తప్పడం లేదు. ఎక్కువ మంది నరసరావుపేట, గుంటూరుకు వెళ్లి ఉన్నత చదువులు చదువుతున్నారు. పల్నాడు జిల్లాలోని దాదాపు 100 గ్రామాలకు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. నాగార్జున సాగర్ జలాశయం సమీపంలో ఉన్నా వినుకొండ, మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లోని వేసవిలో దాదాపు 90 గ్రామాలకు నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటోంది. రక్షితనీటి పథకాల నిర్వహణ సక్రమంగా లేదు. జలజీవన్ మిషన వంటి పథకాలను కూడా గత ప్రభుత్వం వినియోగించుకోకపోవడం వల్ల చాలా గ్రామాల్లో ఇప్పటికి తాగునీటి సమస్య వెంటాడుతోంది. గ్రామాల్లో మౌలిక వసతులకు నిధుల సమస్యను సాకుగా చూపుతున్నారు. నరసరావుపేట పట్టణంలో జిల్లా కేంద్రంగా మౌలిక సదుపాయాలు ఏమాత్రమూ మెరుగుపడలేదు. ఈ నేపథ్యంలో ఈ సమస్యలన్నింటిపైనా సిపిఎం జిల్లా మహాసభలో చర్చించి పోరాట కార్యాచరణ రూపొందించనున్నట్లు జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్ చెప్పారు.



మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ మాచవరం మండలంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు



అక్రమ వడ్డీ వ్యాపారులపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అక్రమవడ్డీ వ్యాపారంతో ప్రజలను మోసం చేస్తున్న నరసరావుపేట పట్టణం శ్రీనివాస కాలనీకి చెందిన పళ్ల నాయుడుబాబు, విజయ్ కళ్యాణి, నాదెండ్ల మండలం సాతులూరుకు చెందిన చల్లా శ్రీనివాసరావుల వేధింపులు నుండి కాపాడాలని బాధితులు కోరారు. ఈ మేరకు నరసరావుపేట జిల్లా కోర్టు న్యాయవాదులు, ప్రజా సంఘాలు, పిడిఎం నాయకులతో కలిసి డీఎస్పీ కె.నాగేశ్వరరావుకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది యశ్వంత్ మాట్లాడుతూ రూ.10 నుండి రూ.20 వరకు అధిక వడ్డీలు వసూలు చేస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని, ఖాళీ నోట్లు, డాక్యుమెంట్లు, చెక్కుల మీద సంతకాలు చేయించుకుని ప్రజల ఆస్తులు దోచుకుంటున్నారని అన్నారు. అక్రమ వడ్డీ వ్యాపారులపై కాల్‌మనీ సెక్షన్ కింద కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని, బాధితులకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది వై.మహేష్, పౌరహక్కుల సంఘం జిల్లా నాయకులు శిఖరం చిన్న, థామస్, పిడిఎం జిల్లా అధ్యక్షులు షేక్.మస్తాన్ వలి, కార్యదర్శి జి.రామకృష్ణ పాల్గొన్నారు.

రేపు మెగా పేరెంట్స్ సమావేశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్ సమావేశం జరుగుతుందని ఎంఇఒ డి.బ్రహ్మేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలను ఎంఇఓ డి.బ్రహ్మేశ్వరరావు సందర్శించి మెగా పేరెంట్స్ సమావేశంపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను అన్ని రంగాల్లోనూ రాణించే విధంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని చెప్పారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలోని అచ్చంపేట వెళ్లే మార్గంలోని రైల్వే గేట్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి గురువారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న నడికూడి రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలిం చారు. మృతుని జేబులో క్రోసూరు మండలం ఉయ్యందన నుండి సత్తెనపల్లి వచ్చిన బస్ టికెట్ లభించింది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిస్తే రైల్వే ఎఎస్ఐ వెంకట్రావు ఫోన్ 7780171069కు సంప్రదించాలని కోరారు.



మహిళల స్వయం ఉపాధికి తోడ్పాటు : కేంద్ర మంత్రి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

పోస్టల్ శాఖ ద్వారా మహిళల స్వయం ఉపాధికి తోడ్పాటును అందిస్తున్నట్టు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గురువారం పార్లమెంటులో పోస్టల్, బ్యాంకింగ్ సేవలపై మాట్లాడారు. 'స్టాంపుల నుంచి పొదుపు వరకు, పోస్ట్ కార్డుల నుంచి పేమెంట్ బ్యాంకుల వరకు, లేఖల నుంచి జీవనోపాధి వరకు, గ్రామీణ సమాజానికి, మహిళలకు ఆర్థిక జీవనోపాధికి వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని చెప్పారు. త్వరలో క్లౌడ్ సేవలను కూడా ప్రవేశపెట్టనున్నామని వెల్లడించారు. గవర్నమెంట్ టు సిటిజన్, బిజినెస్ టు సిటిజన్ సర్వీసులతో సహా 80కిపైగా సేవలను గ్రామీణ ప్రజలకు చేరువ చేస్తున్నామన్నారు.

జాతీయ బ్యాంకుల్లో సగటున 20 శాతం మంది మహిళా ఖాతాదారులు ఉన్నారని, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ప్రారంభించినప్పటి నుండి 45 శాతం కంటే ఎక్కువ మహిళలకు ఖాతాలను ప్రారంభించారన్నారు. పోస్టాఫీసుల సంఖ్యను 1.55 లక్షల నుంచి 1.65 లక్షలకు పెంచడం ద్వారా గ్రామీణ వర్గాల సమగ్ర అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. పోస్టల్ శాఖలో 4.5 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారని, వీరిలో 2 లక్షల మంది డిపార్ట్ మెంటల్ ఉద్యోగులు, 2.5 లక్షల మంది గ్రామీణ డాక్ సేవక్‌లు (జీడీఎస్) ఉద్యోగులు సేవలందిస్తున్నారని తెలిపారు. 2014కు ముందు చాలా పోస్టాఫీసుల్లో ఇంటర్నెట్ కనెక్షన్లు లేవని, ప్రస్తుతం ప్రతి తపాలా కార్యాలయానికి కనీసం రెండు ఇంటర్నెట్ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. 95 శాతానికిపైగా గ్రామీణ ప్రాంతాలు ఇప్పుడు 4జీ కనెక్ట్ అయ్యాయని, ఈ ఫోన్లు 4జీ, 5జీలకు అనుకూలంగా ఉండడంతో చాలా వరకు పోస్టల్ సేవలను మొబైల్ ఫోన్లను ఉపయోగించి డోర్ డెలివరీ చేస్తున్నామని అన్నారు. దీంతోపాటు 22 వేల కంప్యూటర్లు, ఇతర హార్డ్వేర్ అప్ గ్రేడ్ చేశామని తెలిపారు.

వేగం నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు : డిఎస్‌పి రమేష్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరులోని ప్రధాన మార్గాల్లో అతి వేగంగా వెళుతూ ప్రమాదాలకు కారకులవుతున్న బైక్ రేసర్లు, ద్విచక్ర వాహనదారులకు కళ్లెం వేసేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. వీటిని ట్రాఫిక్ డిఎస్‌పి రమేష్, సిఐ సింగయ్య గురువారం విద్యానగర్ వద్ద పరిశీలించారు. కొంతమంది యువకులు కొరిటపాడు - గుజ్జనగుండ్ల ప్రధాన రహదారిపై విచ్చల విడిగా ఇష్టం వచ్చినట్లు మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని వీరిని అదుపు చేసేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్టు డిఎస్‌పి రమేష్ తెలిపారు. జన సంచారం కలిగిన ప్రాంతాల్లో అనుమతి లేని బైకు రేసులు చట్టరీత్యా నేరం, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుని అరెస్టు చేస్తామన్నారు. ప్రధాన రహదారి వెంబడి సిసి కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశామని, ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై తక్షణమే చర్యలు ఉపక్రమిస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా వాహనాలను జాగ్రత్తగా నడపాలని సూచించారు.

రూ.1.83 కోట్లకుపైగా అమరేశ్వరాలయం ఆదాయం

ప్రజాశక్తి - అమరావతి : స్థానిక అమరేశ్వరాలయం హుండీని లెక్కించగా రూ.1,83,74,220 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో సునీల్ కుమార్ గురువారం తెలిపారు. ప్రత్యేక దర్శనం ద్వారా రూ.52,83,400, కార్తీక మాసం అభిషేకం ద్వారా రూ.17,05,800 వచ్చినట్లు చెప్పారు. కార్తీక పరోక్ష నిత్యాభిషేకం పూజ ఆదాయం రూ.14,06,160, లడ్డు ప్రసాదాలు ద్వారా రూ.22,64,400, పులిహోర ప్రసాదం ద్వారా రూ.20,310,00, అన్నదానం ద్వారా రూ.13,51,364, హుండీల ద్వారా రూ.57,10,061 ఆదాయం సమకూరినట్లు వివరించారు.





ప్రజలకు నేరాలు గురించి వివరిస్తున్న తెనాలి రూరల్ సీఐ బెల్లంకొండ శ్రీనివాస్ రావు

పాతబొమ్మువానిపాలెంలో 'వారధి'

ప్రజాశక్తి - కొల్లిపర

సురక్షితమైన సమాజాన్ని నిర్మించడానికి పోలీసులు ప్రజలకు వారధిగా నిలబడతారని తెనాలి రూరల్ సిఐ బెల్లంకొండ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం రాత్రి కొల్లిపర మండలం పాత బొమ్మువానిపాలెంలో 'వారధి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామంలో సంచరించే అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, అనుమానం వచ్చిన వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. నూతన టెక్నాలజీతో ప్రపంచం ముందుకు వెళ్తున్న సమయంలో అనుగుణంగా సైబర్ నేరగాళ్లు కూడా పెరుగుతున్నారని, సైబర్ నేరాలపై ప్రజలు కూడా అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సైబర్ నేరాలు ఎన్ని రకాలు? వాటి ద్వారా ప్రజలను ఏ విధంగా మోసం చేయవచ్చు? అనే విషయాలను ఎస్సై కోటేశ్వరావు వివరించారు. వీడియో ద్వారా ప్రయోగాత్మకంగానూ చూపించారు. ఎఎస్ఐ పోతురాజు, సిబ్బంది పాల్గొన్నారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 49,078
మిర్చి ఎగుమతి	: 52,275
మిర్చి నిల్వ	: 38,121

మిర్చి ధరలు

	రూపాయలలో
334	7,500 - 15,500
నెం.5	8,000 - 13,000
273	10,000 - 15,000
341	7,700 - 13,400
4884	11,500 - 12,500
సూపర్ 10	9,500 - 9,500
నాన్ ఎసి	
తేజ	7,500 - 16,300
బడిగి	8,000 - 13,000
దేవనూరు డీలక్స్	9,000 - 13,700
తాలుకాయలు	4,000 - 11,500
ఎసి	
334	7,700 - 14,500
నెం.5	8,000 - 14,000
273	8,000 - 11,000
341	8,000 - 13,500
4884	8,000 - 14,000
సూపర్ 10	9,800 - 14,500
తేజ	7,700 - 16,500
బడిగి	8,000 - 14,000
దేవనూరు డీలక్స్	9,000 - 12,500
తాలుకాయలు	4,000 - 10,000



శ్రీ బాలాజీ ఐటిఐలో ఘనంగా స్పోర్ట్స్‌మీట్

ప్రజాశక్తి - వినుకొండ

వితంరాజుపల్లి సమీపంలోని శ్రీ బాలాజీ ఐటిఐ కళాశాలలో సంకురాత్రి కృష్ణయ్య- గంగమ్మ జ్ఞాపకార్థం సంకురాత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 18వ స్పోర్ట్స్ మీట్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కర్రి వెంకట్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా దూరదర్శన్ ఎఇ రవికుమార్, మహా టీవీ రిపోర్టర్ సాంబశివరావు మాట్లాడారు. క్రీడలు శరీరానికి వ్యాయామంతో పాటుగా మానసికంగా ఉత్సాహాన్నిస్తాయని చెప్పారు. విద్యార్థులు బాగాచదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. తల్లి దండ్రులను గౌరవించాలని, వాళ్ళని వృద్ధాప్యంలో ఆదరించాలని సూచించారు. అనంతరం క్రికెట్, వాలీబాల్, రన్నింగ్, డిబేట్, ఎస్సే రైటింగ్, కబడ్డీ, షటిల్, షాట్‌పుట్ తదితర పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గత విద్యా సంవత్సరానికి ఉత్తమ విద్యార్థులుగా ఎంపికైన గోనేపల్లి కేశవరాజు, మేరాజ్యోతు వాగ్యానాయక్, ఒంటేరు నరేంద్ర, సంజీవ్ నాయక్ లకు ఒక్కొక్కరికి రూ.1116 నగదు ప్రోత్సాహకాలు, షీల్డ్స్ అందించారు. కార్యక్రమంలో దూరదర్శన్ నుండి ఎస్. కోటేశ్వరరావు, కాలేజీ కరెస్పాండంట్ సంకురాత్రి జానకి పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ : మాచర్ల పట్టణం, మండల పరిధిలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్ల నిర్మాణం చేసుకోనుటకు ఆసక్తిగల వారు ఆయా సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఎఇ మరియదాసు సూచించారు. స్థానిక హౌసింగ్ శాఖ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సొంత స్థలం ఉండి హౌసింగ్ శాఖ ద్వారా గృహ నిర్మాణం చేసుకునేందుకు ఆసక్తిగలవారి నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మండలం పరిధిలోని వారు వారి సంబంధించిన సచివాలయాల్లో ఉన్న ఇంజినీరింగ్ అసిస్టెంట్ వద్ద దరఖాస్తు చేసుకోవాలని, పట్టణ పరిధిలోని వారు సచివాలయంలోని వార్డు యమినిటిస్ సెక్రటరీల వద్ద దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. లబ్ధిదారులకు హౌసింగ్ శాఖ ద్వారా విడతల వారిగా రుణం రూ.2.50 లక్షలు మంజూరు ఆవుతుందన్నారు.

గీతాంజలి లీడ్ స్కూల్ వద్ద ప్లాంటేషన్ డ్రైవ్

ప్రజాశక్తి - వినుకొండ : స్థానిక గీతాంజలి లీడ్ స్కూల్ నందు ప్లాంటేషన్ డ్రైవ్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు పట్టణ పురవీధులలో మొక్కలను చేత బూని చేసిన ప్రదర్శన విశేషంగా అలరించింది. మొక్కలను పెంచి భవిష్యత్తు తరాలకు మంచిని చేకూర్చాలని, చెట్లను నరకకుండా వాటిని పెంచి కాపాడాలని కోరారు. ఇప్పటికే ప్రపంచం చాలా కాలుష్యం అయిందని, రాబోయే తరాలకు పరిశుభ్రమైన ఆక్సిజన్ అందాలంటే ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని కోరారు. ఈ మేరకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి, కరస్పాండెంట్ కిషోర్, డైరెక్టర్ శేషగిరిరావు యేండ్లూరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చి'వరి'లో రైతులకు తప్పని కష్టాలు

ఫెంగల్ తుపానుతో పలుచోట్ల నేలవాలిన కంకిదశలో పంట

కొన్ని ప్రాంతాల్లో కోతలు మొదలు - ధాన్యం దెబ్బతింటుందని ఆందోళన



రంగు మారి, మానుగాయతో ఉన్న ధాన్యం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఫెంగల్ తుపాను ఖరీఫ్‌లో వరి సాగు చేపట్టిన రైతులకు కంటిపై కునుకు లేకుండా చేసింది. గత శనివారం నుండి మంగళవారం వరకు వీస్తున్న చలి గాలులు, చిరు జల్లులతో కూడిన వర్షం కురుస్తుండడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. మరో 2 రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. బుధవారం కాస్త కాయడం ఎటువంటి వర్షం లేకపోవడంతో గురువారం రైతులు నూర్పిడికి సిద్ధమయ్యారు. కాగా గురువారం ఆకాశం కారుమబ్బులతో నిండి ఒక మోస్తరు వర్షం ఆరంభమైంది. రెండు రోజులు ఇచ్చిన తెరపతో రైతులు ఇక వర్షం రాదనుకుని అక్కడక్కడా వరి కోతలు ప్రారంభించిన రైతులు ఉన్నట్టుండి మళ్లీ వర్షాలు కురుస్తుండటంతో అలజడి మొదలైంది. కొద్దిసేపు వర్షం మరి కొద్దిసేపు తెరపిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పచ్చిధాన్యం కావడంతో పట్టల కింద అలాగే రెండు, మూడు రోజులు ఉంచితే ఉక్కతో బూజు పట్టి గింజ నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉంటుందని రైతులు వాపోతున్నారు. అలాగని పట్టలు తీసేద్దామంటే పెద్ద వర్షం వస్తుందేమోనన్న భయం వెంటాడుతోంది. కంకులకు మొలకలు వచ్చే అవకాశం ఉంటుందని దీంతో పూర్తిగా కోతకు సిద్ధంగా ఉన్న వరి పలుచోట్ల నేల కొరుగుతుంది. వర్షం నేపథ్యంలో కింద పడిన కంకులకు మొలకలు వచ్చే అవకాశం ఉందని ఆందోళన నెలకొంది. వర్షాలు కురుస్తుండటంతో చాలా మంది కోతలు వాయిదా వేశారు.



కొత్తపల్లిలో వరి కోత కోస్తున్న యంత్రం

రంగు మారినా! తాలుగింజ వచ్చినా..

పల్నాడు జిల్లాలో ఖరీఫ్‌లో 85990 ఎకరాల్లో వరి సాగు చేయగా రబీలో 11732.5 ఎకరాలు సాగు చేపట్టారు. జిల్లాలో ఇప్పటికే కొన్ని ప్రాంతాలలో వరి నూర్పిడి దశలో ఉంది. తుపాను ప్రభావంతో పల్నాడు జిల్లాలో గతనెల చివరి శనివారం నుండి తేలికపాటి జల్లులు కురుస్తున్నాయి. వివిధ గ్రామాల్లో ఇప్పటికే కోతలు పూర్తి చేసిన రైతులు తమ పంట పాడవుతుందేమోనని అప్రమత్తమయ్యారు. యంత్రాల ద్వారా పంట నూర్పిడి చేసిన రైతులు పొలంలో ఉన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు టార్పాలిన్ పట్టాలు కప్పి కాపాడుకునే ప్రయత్నంలో ఉన్నారు. బుధవారం వరకు ఇదే వాతావరణం ఉంటే కంకిదశలో ఉన్న పంటకు మానుగాయ ఆశించే అవకాశం ఉందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వరి సాగు చేశారు. ఆగస్టులో వేసిన పంట ప్రస్తుతం నూర్పిడి మొదలు పెట్టనున్న తరుణంలో తుపాను ముసురుకుంది. అలాగే సెప్టెంబర్ నెలలో సాగు చేసిన వరి కొన్ని చోట్ల చిరుపొట్ట దశలో ఉంది. వర్షపు నీరు కంకిలోకి వెళ్లి తాలుగింజ, మానుగాయతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నేలల ఆరోగ్యమే మానవాళికి ఆరోగ్యం

ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా రైతులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భూమి ఆరోగ్యంగా ఉంటే ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి అవుతాయని తద్వారా మానవాళికి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా నరసరావుపేట మండలంలోని జొన్నలగడ్డలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు సేంద్రియ వ్యవసాయం చేయడం ద్వారా పంటలకు లబ్ధి కలిగించే సూక్ష్మ పోషకాలను బతికించుకునే అవకాశం ఉంటుందన్నారు. భూసార పరీక్షలు చేయించుకొని భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పంటలకు ఎరువులు వినియోగించాలని, తద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడి సాధించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ పశువులు,గొర్రె ఎరువులు, వర్మీ కంపోస్టు ద్వారా నేలను సారవంతంగా మార్చుకోవాలని, ఆధునిక పద్ధతులు అవలంబించి భూసారాన్ని కాపాడుకుంటూ అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి మాట్లాడుతూ విచక్షణారహితంగా ఎరువులు, పురుగు మందులు వినియోగం వల్ల భూమితో పాటు పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. భూసార పరిరక్షణకు కృషి చేయాలని కోరుతూ రైతులతో, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు భూమిలో పోషకాలు నేల యొక్క ప్రాముఖ్యతను వివరించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డిఆర్‌సి డిప్యూటీ డైరెక్టర్ ఎం.శివకుమారి, నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ, వ్యవసాయ అధికారి భూసార పరీక్షా కేంద్రం అధికారి జి.వరలక్ష్మి, నరసరావుపేట మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు పాల్గొన్నారు.

9వ తేదీ వరకూ పట్టభద్రుల ఓటు నమోదుకు అవకాశం

ప్రజాశక్తి - మాచర్ల

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోకవర్గం ఓట్ల కోసం 9వ తేదిలోపు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. ఆయన తన కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఉన్న 3 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఇప్పటికి 2,129 మంది ఓటర్లుగా ఉన్నట్లు తెలిపారు. వీరిలో కూడా పేరులో, అడ్రస్సులో, డిగ్రీ నమోదులో సవరణలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. నూతనంగా అర్హత కల్గిన వారు కూడా కార్యాలయంలో నేరుగాను, ఆన్‌లైను ద్వారా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి పట్టణ పరిధిలోని 46 పోలింగ్ బూత్‌లకు గాను 46,715 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఇటీవల నిర్వహించిన ప్రత్యేక క్యాంప్‌ల్లో నూతనంగా ఓటు కోరకు 50, తొలగింపులకు 45, సవరణలకు 98 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. వీటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని వివరించారు.

టిడ్కో లబ్ధిదారుల రుణాలకు వడ్డీ ప్రభుత్వం చెల్లిస్తుంది

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు బ్యాంక్‌లకు చెల్లించవలసిన వడ్డిని ప్రభుత్వం చెల్లిస్తుందని కమిషనర్ డి.వేణుబాబు చెప్పారు. ఈ మేరకు మెప్మా ద్వారా బ్యాంక్‌లకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. లబ్ధిదారులు తమ బ్యాంక్ ఖాతాలకు తప్పనిసరిగా ఎన్‌పిసిఎల్ లింక్ చేయించుకోవాలని సూచించారు.

రైతుల వద్ద కొనుగోలు.. సిసిఐలో అమ్మకాలు..

ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి సిసిఐ కేంద్రంలోపత్తి కొనుగోలు మందకొడిగా సాగుతున్నాయి. పట్టణంలోని లక్ష్మీ కాటన్ ట్రేడింగ్ కంపెనీలు సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రోజులకొద్దీ మిల్లు ముందు రైతులు పడిగాపులు గాస్తున్నారు సిసిఐ బయ్యర్ కొత్త కావటంతో కొనుగోళ్ల ఊపొందుకోలేదు. రైతులు దగ్గర తక్కువ ధరకు కొనుగోలు చేసిన మధ్య దళారులు అధిక ధరకు పత్తి కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తేమ శాతం పేరుతో బయ్యర్ బోరానికి మూడు నాలుగు కిలోలు తగ్గిస్తున్నాడని రైతులు వాపోతున్నారు. గతనెల 20 నుండి కొనుగోలు ప్రారంభమైన నేటికి ఊపొందుకోలేదు. ఇప్పటివరకు 243 మంది రైతుల నుండి 6,476 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. దీనికి తోడు బిల్లులు చెల్లింపు ఆలస్యం అవుతుండటంతో పత్తి కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు రైతులు ఆసక్తి చూపటం లేదు. కనీష్టంగా రూ.7122, గరిష్టంగా రూ.7471 కు పంటను కొంటున్నారు. కొనుగోళ్ల ఆలస్యమవటంతోపాటు రవాణా ఖర్చులు అధికంగా ఉండటంతో రైతులు తమ పంటను గ్రామంలోనే తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. దళారులు రైతుల దగ్గర క్వింటాళ్ రూ.6 వేలకు కొనుగోలు చేసి సిసిఐ కేంద్రంలో అధిక ధరలకు విక్రయిస్తున్నారు.



సిసిఐ కేంద్రం వద్ద ఉన్న పత్తిలోడులు

ఇళ్ల నిర్మాణాలు నెలాఖరులోగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

హౌసింగ్ లేఅవుట్స్‌ల్లో ఇళ్ల నిర్మాణ పనుల పొందిన కాంట్రాక్టర్లు, సొంతగా నిర్మాణం చేసుకునే వారు డిసెంబర్ నాటికి నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేసేలా హౌసింగ్, జిఎంసి ఇంజినీరింగ్ అధికారులు ప్రతిరోజు పర్యవేక్షించాలని నగర కమిషనర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. ఈ అంశంపై ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్మెంట్ అధికారులు, ఎమినిటి కార్యదర్శులు, కాంట్రాక్టర్లు, మెప్మా సిబ్బందితో జిఎంసి కౌన్సిల్ హాల్‌లో గురువారం కమిషనర్ సమీక్షించారు. తొలుత లేఅవుట్స్ వారీగా ఇళ్ల నిర్మాణం ఏ మేరకు పూర్తి అయింది, గ్రౌండ్ లెవల్ ఎన్ని ఉన్నది, మౌలిక వసతులు, బిల్లుల చెల్లింపు, ఇసుక, సిమెంట్, ఇనుము లభ్యత తదితర అంశాలను సమీక్షించారు. నిర్మాణ పనులు కాంట్రాక్టర్ల వారీగా ఇచ్చిన టైం లైన్ మేరకు జరగాలని, నిర్మాణ పనుల కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్లు అవసరమైన కార్మికులను సిద్ధం చేసుకోవాలన్నారు. సొంతగా నిర్మాణం చేసుకునే వారు కూడా త్వరగా చేసుకునేలా తోడ్పాటుని అందించాలన్నారు. ఇప్పటికే పేరేచర్ల లేఅవుట్‌లో నీటి సమస్య పరిష్కారానికి బోర్లు ఏర్పాటు చేశామని, త్వరలో లేఅవుట్ ప్రధాన రోడ్ మరమ్మతులు కూడా పూర్తి చేస్తామని తెలిపారు. స్థలం లబ్ధిదారుల్లోని డ్వాక్రా సభ్యులకు బ్యాంక్‌ల నుండి రూ.35 వేలు రుణం అందించేలా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా ఉంటున్న మెప్మా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి, మంగళవారం నాటికి రుణాలు మంజూరు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, మెప్మా పిడి విజయలక్ష్మీ, హౌసింగ్ ఈఈ శంకర్రావు పాల్గొన్నారు.


రిజర్వాయర్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్‌కు నోటీసులు

విలీన గ్రామాల ప్రజలకు తాగునీటిని అందించడానికి ప్రతిపాదించిన గోరంట్ల కొండమీద రిజర్వాయర్ పనులు అగ్రిమెంట్ మేరకు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయని కాంట్రాక్టర్‌కు నోటిసు ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. గోరంట్ల కొండమీద రిజర్వాయర్ పనులు, తక్కెళ్లపాడులో పంపింగ్‌లైన్‌పై ఏర్పడిన లీకులను ఆయన పరిశీలించారు. గోరంట్ల కొండమీద రిజర్వాయర్ నిర్మాణం వలన చుట్టు పక్కల పలుప్రాంతాలకుత్రాగునీటి కొరత తీర్చడానికి వీలు కలుగుతుందన్నారు. అటువంటి ప్రాధాన్యత కలిగిన రిజర్వాయర్ పనులు ఇప్పటికే తీవ్రజాప్యం జరిగాయని, ఇక నుండి అలా జరగడానికి వీలు లేదని స్పష్టం చేశారు. రిజర్వాయర్ నిర్మాణ పనులను టెండర్ అగ్రిమెంట్ మేరకు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయని కాంట్రాక్టర్‌కి నోటీసులు ఇవ్వాలని, కాంట్రాక్టర్ స్పందన మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం తక్కెళ్లపాడులో గుంటూరు హెడ్ వాటర్ వర్క్స్ వచ్చే తాగునీటి పంపింగ్ లైన్‌పై ఏర్పడిన లీకును పరిశీలించి, తాగునీటి వృథాను అరికట్టడానికి లీకు మరమత్తు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని డిఈఈని ఆదేశించారు. పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, డిఈఈ రమేష్ బాబు, హనీఫ్, ఏఎంహెచ్ఓ ఆనందకుమార్ పాల్గొన్నారు.

చేనేత కార్మికుల నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభం


నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అబద్ధయ్య

ప్రజాశక్తి - మంగళగిరి

చేనేత కార్మికుల అభ్యున్నతి కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య శిక్షణ అభివృద్ధి కార్పొరేషన్, చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణంలోని రాజీవ్ గృహకల్ప రోడ్డులో నైపుణ్య శిక్షణ వీవింగ్ సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్ పద్మశాలియ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో 30 మంది చేనేత కార్మికులకు 45 రోజులపాటు వెఫ్ట్ ఇక్కత్, బల్ల కమ్మిలపై నైపుణ్య శిక్షణ పొంది రోజుకు సగటున రూ.600 మజూరి పొందవచ్చని అన్నారు. చేనేతకు పూర్వ వైభవం తెచ్చేందుకు స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని అన్నారు. చేనేత జౌళి శాఖ అడిషనల్ డైరెక్టర్ కె.శ్రీకాంత్ ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఐదు సెంట్లను చేనేత కార్మికుల కోసం ప్రారంభిస్తున్నట్లుగా తెలిపారు. రెండు రకాల నైపుణ్య శిక్షణ పొందడం వలన చేనేత కార్మికులకు అనేకమందికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. వీటిద్వారా నైపుణ్యం పొంది నేసిన చేనేత వస్త్రాలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంటుందని, దీనివలన చేనేత కార్మికుల జీవనోపాధి మెరుగుదలకు ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ కె.కన్నబాబు, సహాయ సంచాలకులు బి.ఉదయ్ కుమార్, అభివృద్ధి అధికారి బి శ్రీనివాసరావు, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ధనుంజయరావు పాల్గొన్నారు.

ఆ డబ్బు చాలకపోతే డ్వాక్రా లోన్లు తీసుకోండి

ఇళ్ల నిర్మాణ లబ్ధిదార్లకు తుమ్మపూడి గ్రామ సభలో డిపిఒ సూచన

ప్రజాశక్తి - దుగ్గిరాల



అన్ని శాఖలను అనుసంధానం చేస్తూ ప్రభుత్వ పథకాలు ఎలా అమలు జరుగుతున్నాయో పరిశీలిస్తున్నట్టు జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్ అన్నారు. మండలంలోని తుమ్మపూడి పంచాయితీ కార్యాల యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు అధికారులు అమలుయ్యేలా పనిచేస్తున్నారా? లేదా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. న్యూ హౌసింగ్ కాలనీలలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులను ఇళ్లు కట్టుకునేటట్లు ప్రోత్సహించడానికి ఈ గ్రామ సభ నిర్వహించినట్లు తెలిపారు. రూ.లక్ష 80 వేలు చాలక పోతే డ్వాక్రా లోన్లు తీసుకొని ఇల్లు పూర్తి చేయాలని సూచించారు. గతంలో పెండింగ్లో ఉన్న ఎన్టీఆర్ గృహాల లబ్ధిదారులను అంచనా వేస్తు వారికి కూడా ఇల్లు పూర్తి చేసుకోవటానికి నిధులు కేటాయిస్తుందని తెలిపారు. అనంతరం రూ.7 లక్షలతో శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డుకు ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఇన్‌ఛార్జి ఎంపిపి షేక్ జబీన్, టిడిపి మండల అధ్యక్షులు కేశంనేని శ్రీఅనిత, సర్పంచ్ షేక్ అజీజూన్, షేక్ జానీబాష, మాజీ సర్పంచ్ ఎన్.శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. గురువారం తుమ్మపూడి, చిలువూరు, కంఠంరాజు కొండూరు పెనుమూలి గ్రామాల్లో సభలు నిర్వహించనున్నారు.

నేడు ఎసిసి ఫ్యాక్టరీ కార్మికుల పాదయాత్ర

రెండోరోజు కొనసాగిన రిలేదీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల గుడిసెలను, ప్రభుత్వ అధికారులు చట్టాలను దిక్కరించి అక్రమంగా కూల్చిన విధానానికి నిరసనగా కార్మికులు చేపట్టిన దీక్షలు గురువారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి. దీక్షలను మహిళా కార్మికు రాలు కూరపాటి దిబోరాణి ప్రారంభించారు. దీక్షలో ఎం.శారద, జి అన్నమ్మ, బి.నవనీతం, మల్లికాంబ, డి.రమణ కూర్చునారు. ఈ సందర్భంగా సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ కార్మిక, ప్రజా సంఘాలను కలుపుకొని పోరాడటమే లక్ష్యంగా ముందుకు సాగాలని చెప్పారు. కార్మికుల గుడిసెలను కూల్చి వేయించిన అధికారులు తగిన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు వి.దుర్గారావు మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా అధికారుల వ్యవహరించటం సరికాదన్నారు. కార్మికులు చేస్తున్న పోరాటానికి సిఐటియు పూర్తి మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, బి.సూర్య ప్రకాష్, సుబ్బారావు, ఎం.గురవయ్య,



యెహోషువ, ఎస్‌కె బాష, డి.బేబీమ్మ, ఇమాంబి, దుర్గ భవాని, నాగేశ్వరరావు, ఇస్రాయెల్, ఎం.శివమల్లేశ్వరి, పిచ్చయ్య, ఆర్.శివ, బి.దానయ్య పాల్గొన్నారు.

నేడు మంగళగిరికి పాదయాత్ర

గుడిసెలకూల్చివేతకు నిరసనగా శుక్రవారం ఉదయం 10 గంటలకు ఫ్యాక్టరీ దీక్ష శిబిరం నుండి మంగళగిరి ఎంటిఎంసి కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు పోరాట కమిటీ కన్వీనర్ స్టీవెన్ తెలిపారు. కార్మిక సంఘాల నాయకులతో కలిసి సాగే ఈ పాదయాత్రలో కార్మికులందరూ సమయానికి దీక్ష శిబిరం వద్దకు చేరుకోవాలని కోరారు.


మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఆకృతితో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

మీటింగ్‌కు ముస్తాబయిన ఎన్ఎస్ఎస్ఎం పాఠశాల

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న ఎంపిటిఎం (మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్)లో భాగంగా స్థానిక ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం పాఠశాలను ముస్తాబుచేశారు. పాఠశాలలో గురువారం 300 మంది విద్యార్థులతో ఎంపిటిఎం ఆకృతి రూపకల్పనతో శనివారం ఎంపిటిఎం కార్యక్రమానికి ఆహ్వానం పలికారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పురప్రముఖులకు ఆహ్వానం పలికేందుకు చెట్లకు రంగులు వేసి తీర్చి దిద్దుతున్నామని పాఠశాల చిత్రలేఖనోపాధ్యాయులు బెల్లంకొండ వెంకట్ తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.సునీత తెలిపారు. ప్రత్యేకంగా స్త్రీలకు ముగ్గులు పోటీలు, పురుషులకు టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లితండ్రులకు శుభదిన్ భోజన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రసాద్, నవీన్, ప్రేమ్, మనోజ్, జైసింహ, రెహమాన్ ఖాన్, జాన్సి, బాలమ్మ, విజయలక్ష్మి, కరీముల్లా, సంపూర్ణ, వెంకటరమణ, ఎస్ఎంఇ చైర్మన్ జి.కిరణ్ పాల్గొన్నారు.


నియామక ఉత్తర్వులు ఇస్తున్న వీసీ కె.గంగాధరరావు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మహిళా హాస్టల్ చీఫ్ వార్డెన్‌గా డాక్టర్ మాధవి

మరో ఐదుగురు నూతన వార్డెన్‌ల నియామకం

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మహిళా వసతి గృహంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ వర్సిటీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. మహిళా వసతి గృహాలకు చీఫ్ వార్టిన్‌తో పాటు అడిషనల్ చీఫ్ వార్డెన్, డిప్యూటీ వార్డెన్‌లను నియమిస్తూ ఇన్‌ఛార్జి విసి కె.గంగాధరరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చీఫ్ వార్డెన్‌గా బోటనీ అండ్ మైక్రో బయాలజీ విభాగానికి చెందిన అధ్యాపకురాలు డాక్టర్ జె.మాధవి నియమితులయ్యారు. అదనపు చీఫ్ వార్డెన్‌గా డాక్టర్ వై.సునీత, (ఇంజనీరింగ్ కాలేజి) డాక్టర్ ఎస్.సుజన (ఫార్మసీ కళాశాల) డిప్యూటీ వార్డెన్లుగా డాక్టర్ ఎఎస్‌వి రాధిక, డాక్టర్ వి.సుభాషిని, టి.ఝాన్సీని నియమించారు. ఇంజినీరింగ్ కళాశాలకు చీఫ్ వార్డెన్‌గా అసిస్టెంట్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.గోపికృష్ణను నియమించారు. మరొక అసిస్టెంట్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.చంద్రమౌళికి అడిషనల్ చీఫ్ వార్డెన్ బాధ్యతలు అప్పగించారు. డిప్యూటీ వార్డెన్‌లుగా ఆర్.విజయ్ ప్రకాష్, యు.సతీష్ కుమార్, కెఎస్. రాజశేఖర్, డాక్టర్ సిహెచ్ పుణ్య శేకర్, డాక్టర్ బి.విజయకుమార్‌ను నియమించారు. ఏడాది పాటు వీరు వార్డెన్లుగా విధులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన వారికి వీసీతోపాటు ఇన్‌ఛార్జి రెక్టార్ కె.రత్నషీలామణి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ సింహాచలం, నియామక ఉత్తర్వులు అందజేశారు. దూరవిద్య కేంద్రం ఇన్‌ఛార్జి డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పండగ వాతావరణంలో పేరెంట్స్ మీట్

ప్రజాశక్తి - అమరావతి

ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఈ నెల 7వ తేదీన పండగ వాతావరణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. పాఠశాల బలోపేతం, విద్యా వికాసం, సమస్యలు పరిష్కారానికి ఈ కార్యక్రమం దిక్సూచి లాంటిదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య ఒక ఆత్మీయ వారధిని ఈ సమావేశం నిర్మిస్తుంది. ఎడ్యుకేట్, ఎంగేజ్, ఎంపవర్ లక్ష్యాలతో దేశంలోనే తొలిసారిగా రాష్ట్రమంతా ఒకేసారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం పండుగ వాతావరణంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, దాతలు, పాఠశాల పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరవుతారు. విద్యార్థి విద్యా ప్రగతి, క్రీడా ప్రగతి, వ్యక్తిగత ఆరోగ్య అంశాలతో కూడిన హెూలిస్టిక్ ప్రొగ్రెస్ రిపోర్టు పంపిణీ చేయనున్నారు. విద్యార్థుల విద్యా ప్రగతి, క్రమశిక్షణ తదితర విషయాలను తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా చర్చిస్తారు. సమావేశంలో పాఠశాల పటిష్టత, విద్యార్థి వికాసం, సమస్యల పరిష్కారానికి సలహాలు తీసుకోనున్నారు. పూర్వ విద్యార్థులను ఆహ్వానించి వారి విజయ గాథలను విద్యార్థులకు వివరిస్తారు. ఆ తర్వాత విద్యార్థి తల్లులకు ముగ్గుల పోటీ, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ నిర్వహించి బహుమతులు అందిస్తారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటలకు మొదలై మధ్యాహ్నం ఒంటిగంట వరకు సాగుతుంది. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని రుచి చూపేలా.. సహపంక్తి భోజనంతో ముగుస్తుంది. రాజకీయాలకు అతీతంగా, ఆహ్లాదకర వాతావరణంలో ఒక పండుగలాగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారి చాదరాజుపల్లి శివబాబు కోరారు.



సమావేశాలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాలను సమన్వయంతో విజయవంతం చేయాలని పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్ అధికారులకు సూచించారు. రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శుక్రవారం జరగే పేరెంట్స్ మీట్‌పై పలు సూచనలు చేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని హత్య అమానుషం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

విద్యాబుద్ధులు నేర్పి, భవిష్యత్తుకు మార్గం చూపే ఉపాధ్యాయునిపై దాడి చేసి, హతమార్చడం అమానుష చర్య అని ఏపీసీపీఎస్ఈఎ మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ శాంతిబాయి అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి, కొత్తపల్లిలో జిల్లా పరిషత్తు హైస్కూల్ ఉపాధ్యాయుడిపై విద్యార్థులే దాడి చేసి హతమార్చడాన్ని తీవ్రంగా ఖండించారు. గురువును ఒక దైవంగా భావించే సమాజంలో.. హేళన చేసి కొట్టి చంపే అరాచకత్వానికి దిగజారిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. నేడు ఉపాధ్యాయులపై తల్లిదండ్రుల దాడులు, కేసులు పెట్టడం బాధాకరమన్నారు. ఉపాధ్యాయ సమాజానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మరణించిన ఉపాధ్యాయుడి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

దాడి హేయమైన చర్య

ప్రజాశక్తి- మాచర్ల రూరల్ :

రాయచోటి కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇజాజ్ అహ్మద్ అనే ఉపాధ్యాయునిపై దాడి చేసిన విద్యార్థులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గుట్కా, గంజాయి ప్రభావం పాఠశాలపై ఉన్నట్లు తెలిసిందని, అందువల్లే విద్యార్థుల్లో హింసాత్మక ధోరణి పెరిగిందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే ఈ విష సంస్కృతిని నియంత్రించాలని కోరారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు కె.కష్ణారావు, గంగాధర్ బాబు, నజీర్, నాసరయ్య, రమేష్, శ్రీనివాసరావు, కొర్లయ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన

ఎస్టీయూ ఖండన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఉపాధ్యాయునిపై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. జరిగిన హత్యపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయించాలని రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు, ఎస్టీయూ డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ప్రశాంతంగా ముగిసిన కార్మిక సంఘాల ఎన్నికలు

ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్

దక్షిణ మధ్య రైల్వే గుర్తింపు పొందిన కార్మిక సంఘాల ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. మొతం 190 ఓట్లకు గానూ 176 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని ఎన్నికల అధికారి ఎల్.వి.ఆర్.శాస్త్రి తెలిపారు. గుంటూరు డివిజన్ పరిధిలో యూనియన్ ఎన్నికలు రెండు రోజులు సాగాయి. సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సిరిపురం నుంచి బెల్లంకొండ రైల్వేస్టేషన్ పరిధిలో ఉన్న ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. గ్యాంగ్‌మన్ నుంచి గేట్‌మన్, లోకో పైలట్‌లు, స్టేషన్ మాస్టార్లు, వివిధ హెూదాల్లో పనిచేసిన ఉద్యోగులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్‌ల మధ్య ప్రధానంగా పోటీ నెలకొంది. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగింది. పోలింగ్ బాక్సులను రైల్వే పోలీస్ బందోబస్తు మధ్య గుంటూరు రైల్వే డివిజన్ కార్యాలయానికి తరలించారు. వివిధ యూనియన్లకు చెందిన నాయకులు కె.వెంకటరెడ్డి, కొండానాయక్, ఏసుబాబు, సి.హెచ్, వేణుగోపాల్, బి.నరేష్, రావిపాటి నరేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి- ఈపూరు

శాశ్వత భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 6 నుంచి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు నరసరావుపేట ఆర్డీవో కె.మధులత అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన భూ సమస్యల విచారణను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం చేపట్టారు. కొచ్చర్ల, ముప్పాళ్ల, గుండెపల్లి గ్రామాల అర్జీదారులతో భూ సమస్యలపై చర్చించి.. వారికి పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీల వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి, నిర్ణీత సమయంలో పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. సాగు నీటి పన్ను పరిధిలో వచ్చే పొలాలను గుర్తించి పన్ను వసూళ్లకు అవసరమైన కార్యాచరణ చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు నళిని తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

పెదకూరపాడు: ఈనెల ఆరో తేదీ నుంచి రెవెన్యూ గ్రామసభలు జరుగుతాయని పెద్దకూరపాడు తహసీల్దార్ డానియేల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులు వినియోగించుకోవాలి

సత్తెనపల్లి రూరల్: సత్తెనపల్లి మండలంలో శుక్రవారం నుంచి వచ్చే జనవరి 3వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.ఎస్.చక్రవర్తి తెలిపారు. సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ సదస్సుల షెడ్యూల్‌ను ప్రకటించారు. భూ సంబంధిత సమస్యలు ఉంటే రైతులు అర్జీలు అందజేయవచ్చని సూచించారు.

సీడ్‌బాల్‌పై అవగాహన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక గాంధీ పేటలోనిచైతన్య లిటిల్ స్కూలు వద్ద విద్యార్థులకు సీడ్ బాల్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్లబ్ డైరెక్టర్ దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సుమారు ఒక లక్ష సీడ్ బాల్స్ తయారుచేసి జూన్ మొదటి వారంలో కోటప్పకొండ, కొండవీడు తదితర చోట్ల చల్లేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షులు ఆళ్ల వేమన రెడ్డి, కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాద్, స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి- మాచర్ల

దివ్యాంగుల సమస్యలు పరిష్కారానికి కషి చేస్తానని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. అబ్దుల్ కలాం సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని బీఎస్సార్ ఫంక్షన్ హాలు నందు ప్రపంచ వికలాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సేవాసమితి అధ్యక్షులు షేక్ పాషావలి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు బ్రహ్మానందరెడ్డి హాజరై మాట్లాడారు. దివ్యాంగులకు భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.3 వేల నుంచి రూ.6 వేల వరకు పింఛన్ పెంచారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు సేవ చేస్తున్న పలువురిని అభినందించారు. దివ్యాంగులకు హెల్త్ కార్డులు అందజేశారు. ప్రతిభ జూనియర్ కాలేజీ విద్యార్థులు, దాతలు సేకరించిన బియ్యాన్ని పేదలకు పంపిణీ చేశారు.

త్వరితగతిన ఉపాధిహామీ పనులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో గుర్తించిన పనులను ఆమోదించి, కూలీలకు త్వరితగతిన పనులు కల్పించాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ప్రసాద్ సూచించారు. రొంపిచర్ల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి వెంటనే జాబ్ కార్డులు పంపిణీ చేయాలని చెప్పారు. 2019 నుంచి ఇప్పటివరకు 100 రోజులు ఉపాధి హామీ పనులు చేసిన వారి పేర్లను ఉన్నతి యాప్ లో నమోదు చేయాలన్నారు. ఏడాదిలో 100 రోజులు పనులు చేసిన వారి కుటుంబ సభ్యులకు, వారిలో చదువుకున్న వారికి స్కిల్ డెవలప్మెంట్‌పై అవగాహన కలిగించడమే ఉన్నతి పథకం లక్ష్యమని తెలిపారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థినుల సామాజిక సేవ...

ప్రజాశక్తి-ముప్పాళ్ల

సామాజిక సేవ కూడా విద్యలో భాగం కావాలని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్, ఎన్.ఎస్.ఎస్ ప్రొగ్రాం అధికారి డాక్టర్ విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ అవగాహన కషి అనుభవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవ ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మండల వ్యవసాయధికారాణి ఎం.అరుణ మాట్లాడుతూ సామాజిక సేవ చేయడం ద్వారా విద్యార్థినులకు నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని చెప్పారు. అనంతరం బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు స్వచ్ఛభారత్ నినాదంతో పురవీధుల్లో ర్యాలీగా వెళ్లారు.



చెట్ల ప్రాధాన్యంపై అవగాహన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మండల పరిధిలోని కావూరు గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ సిబ్బంది, తోఫీ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం, చెట్ల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తోఫీ ప్రతినిధి ప్రణీత్ వర్మ రైతులకు ఉద్యానవన మొక్కలు, అటవీ జాతి మొక్కలను వ్యవసాయ భూమిలో నాటడం వల్ల వచ్చే ప్రయోజనాలను వివరించారు.

8న మెగా ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో ఈ నెల 8న మెగా ఉచిత నేత్ర శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఓరుగంటి చెన్నకేశవరావు, పందిరి నరసింహారావు తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ నంద్యాల శాంతిరాం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కంటి విభాగం సహకారంతో ఓరుగంటి సైదమ్మ జ్ఞాపకార్థం స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయ ఆవరణలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొనే కంటి రోగులకు ఉచితంగా కంటి శుక్లముల ఆపరేషన్లు చేస్తారన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దోమల నివారణకు ఫాగింగ్

– కమిషనర్ వేణుబాబు

ప్రజాశక్తి- మాచర్ల

పట్టణ పరిధిలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నట్లు కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎరుకల కాలనీ, శరీన్‌కాలనీ, వినాయకునిగుట్ట, రామాటాకీసు ప్రాంతంలో ఫాగింగ్ చేసినట్లు తెలిపారు. పట్టణంలో ప్రతి వీధిలో ఫాగింగ్ చేసేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లు వివరించారు. మురుగు కాలువల్లో అయిల్ బాల్స్ వేయడం ద్వారా దోమల నివారణకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కూడ తమ ఇళ్ల ముందున్న మురుగు కాలవల్లో ప్లాస్టిక్ కవర్లు, కొబ్బరి బొండాలు, ఇతరాలు వేయకుండా మురుగు పారుదలకు సహకారం అందించాలని కోరారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు గురువారం పట్టణంలో జరుగుతున్న పారిశుద్ధ పనులను, రహదారి మరమ్మతులను పరిశీలించారు. సీసీ రోడ్డు ప్యాచ్ వర్కులు, రావిపాడు రోడ్డు బైపాస్‌లో గల డంపింగ్, బరంపేట మసీదు, కరెంట్ ఆఫీస్, పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన పట్టణంలోని శివసంజీవయ్య, క్రిస్టియన్ పాలెం కాలనీలలో పర్యటించారు.

నేడు క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - వినుకొండ

క్రీస్తు ఆశీర్వాద సంఘం ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం సాయంత్రం పల్నాడు రోడ్డులోని కరెంట్ ఆఫీస్ ఎదురు బజారులో నిర్వహిస్తున్నట్లు సంఘ సభ్యులు, పాస్టర్ పి.ఫిలిప్ తెలిపారు. రాజమండ్రి క్రైస్ట్ వర్షిప్ సెంటర్ దైవ సేవకులు బ్లెస్సి వెస్లీ ముఖ్య ప్రసంగీకులుగా, క్రిస్మస్ సందేశం వినిపిస్తారని పేర్కొన్నారు. క్రైస్తవ భక్తులంతా హాజరు కావాలని కోరారు.



వర్సిటీ థియేటర్ ఆర్ట్స్ విద్యార్థులకు విరాళం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పెర్ఫార్మెన్స్ అండ్ ఫైన్ ఆర్ట్స్‌లోని థియేటర్ ఆర్ట్స్ విద్యార్థులకు ప్రముఖ దర్శకులు, నటులు, వ్యాపారవేత్త డాక్టర్ ముప్పవరపు సురేష్ బాబు రూ.లక్ష ఆర్థిక సహకారం అందించారు. వర్సిటీ విద్యార్థులు సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల యువజన ఉత్సవాల్లో పాల్గొంటున్న సందర్భంగా వారి ప్రదర్శనలకు సంబంధించి అవసరమయ్యే వ్యయం, దృశ్య బంధ నిర్మాణం తదితర అవసరాల నిమిత్తం ఆర్థిక సహకారాన్ని ఇన్చార్జి వీసీ ఆచార్య కె.గంగాధర రావు చేతుల మీదుగా అందించారు.



జనావాసాల్లోకి కొండచిలువలు

ప్రజాశక్తి-దుగ్గిరాల

మండలంలో కొండచిలువలు తరచూ జనావాసాల్లోకి వస్తున్నాయి. బుధవారం రాత్రి మండలంలోని మొరంపూడి గ్రామంలో ఓ ఇంట్లో కొండచిలువ ప్రవేశించింది. స్థానిక యువకులు దానిని హతమార్చారు. వారం రోజుల క్రితం దుగ్గిరాల- పెనుమూలి గ్రామాల మధ్య రోడ్డుపై మరో కొండచిలువను కూడా స్థానికులు హతమార్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొండచిలువలు నీటి ప్రవాహంతో పాటు కొండల ప్రాంతం నుంచి వచ్చి ఉండవచ్చని ప్రజలు భావిస్తున్నారు.

తహశీల్దారుగా హరిబాబు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - మేడికొండూరు



మేడికొండూరు మండల నూతన తహసీల్దారుగా ఎం.హరిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన ప్రకాశం జిల్లాలోని ఎర్రగొండపాలెం తహసీల్దారుగా పని చేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి బాధ్యతలు చూసిన కళ్యాణి గుంటూరు కలెక్టరేట్‌కు వెళ్లారు. హరిబాబు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యలు పరిష్కారం కోసం పనిచేస్తానని తెలిపారు.

58 పాఠశాలల్లో మెగా సమావేశాలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

పాఠశాలల్లో నిర్వహించనున్న మెగా పేరెంట్స్ సమావేశాలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి కె.లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం మండల వ్యాప్తంగా 58 ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లితండ్రులతో సమావేశాలు నిర్వహించ నున్నట్లు చెప్పారు. వివిధ పోటీలను నిర్వహించనున్నామన్నారు.

సత్వర పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి- దుగ్గిరాల

రైతుల సమస్యలు సత్వర పరిష్కారానికే మండల స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దారు ఐ.సునీత తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రికార్డుల క్రమబద్ధీకరణ, భూ సంబంధిత సమస్యల సత్వర పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల సర్వేయర్, సబ్ రిజిస్ట్రార్‌తోపాటు రెవెన్యూ శాఖకు సంబంధించిన అధికారులు అందరూ పాల్గొంటారని చెప్పారు. సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించి రసీదు కూడా ఇస్తారని తెలిపారు. 6న గొడవర్రు, 10న పెద్ద కొండూరు, 12న పేరుకులపూడి, 13న ఈమని, 17న దుగ్గిరాల, 19న పెనుమూలి, 21న చిలువూరు, 24న డీపీ అగ్రహారం, 26న చింతలపూడి, 28న శంగారపురం, 31న చిన్నపాలెం, జనవరి 2న మోరంపూడి, 4న తుమ్మపూడి, 8న కంఠంరాజు కొండూరు గ్రామాల్లో సదస్సులు ఉంటాయని తెలిపారు.



మాట్లాడుతున్న తహసీల్దారు సునీత

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లి రూరల్:

తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు జరగనున్నట్లు తహసీల్దారు సీతారామయ్య తెలిపారు. సీఆర్‌డీఏ పరిధిలో ఉన్న ఉండవల్లి, పెనుమాక గ్రామాల్లో సదస్సులు నిర్వహించడం లేదని.. మిగిలిన గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సదస్సుల నిర్వహణపై చర్చిస్తున్న తహసీల్దారు సీతారామయ్య



మంత్రి మనోహర్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తమ 22 ఏళ్ల చిరకాల కోరికను నెరవేర్చి, రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయడంతో మంత్రి నాదెండ్ల మనోహర్‌కు రావిరవీంద్రనాథ్ నగర్ కాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. వార్డు పర్యటనకు వచ్చిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్‌కు రహదారి సమస్యను విన్నవించామని.. ఇచ్చిన మాటకు కట్టుబడి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారని తెలిపారు. ఇప్పటి వరకు సరైన రోడ్డు మార్గం లేక చిన్నారులు, విద్యార్థులు, గర్భిణులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం నాదెండ్ల కృషితో తమ చిరకాల వాంఛ తీరిందని ఆనందం వ్యక్తం చేశారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - పెదనందిపాడు

భారత రాజ్యాంగం ద్వారా సమసమాజ స్థాపనకు విశేష కషి చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రజలందరి హదయాల్లో చిరస్మరణీయులుగా నిలిచి ఉన్నారని ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు గేరా మోహనరావు తెలిపారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వహకురాలు పి.సుభాషిని అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మోహనరావు మాట్లాడుతూ సమాజంలోని అంటరానితనం, సామాజిక అసమానతలను రూపుమాపేందుకు అంబేద్కర్ అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు గారపాటి రమేష్, గుగ్గిలం సాయిబాబు, వెలినేని శివయ్య, వెంకటేశ్వర్లు, వీరయ్య, ఆనందరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రతి ఒక్క విద్యార్థికీ అంతర్గత నైపుణ్యాలు ఉంటాయని, వాటిని గ్రహించి సాధన చేస్తే విజయం చేకూరుతుందని ఆంధ్ర క్రైస్తవ కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు అన్నా షాలిని అన్నారు. స్థానిక టి.జె.పి.ఎస్ కళాశాల అంగ్లవిభాగం ఆధ్వర్యంలో గురువారం సాఫ్ట్‌స్కిల్స్ అనే అంశంపై ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా షాలిని మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలతో పాటు సమయపాలన, క్రమశిక్షణ, అంకితభావం వంటి లక్షణాలు విద్యార్థులు అలవరచుకుని జీవితంలో ముందుకు వెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, ఆంగ్ల విభాగాదిపతి జి.భాగ్యమ్మ, వైస్‌ప్రిన్సిపాల్ భానుమురళి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

వందేళ్ల క్రితం నిర్వహించిన సర్వే ఆధారంగా భూ సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించేందుకు రీ సర్వే చేపట్టినట్లు తెనాలి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. తెనాలి తహసీల్దారు కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత తహసీల్దారు కార్యాలయంలో పూర్వపు భూరికార్డుల్లో పొందుపరచిన హద్దులను గ్రౌండ్ ట్రుతింగ్ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దారు కేవీ గోపాలకృష్ణతో కలసి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు ఆస్తులు, రోడ్లు, పార్కులు, కాలువలు, క్రీడా మైదానాలకు సంబంధించిన భూ రికార్డులు కచ్చితంగా ఉన్నాయో లేదో పరిశీలించడం రీ సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో తెనాలి అర్బన్, రూరల్ పరిదిలో రీ సర్వే వేగవంతం చేశామన్నారు. భూసమస్యలు, వివాదాల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారి ఎం.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షలతో మేలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

రైతులు మట్టి పరీక్షలు చేయించుకుంటే వ్యవసాయ భూముల్లో ఏయే లోపాలు ఉంటాయో తెలుసుకుని, వాటికి సంబంధించిన ఎరువులు, సూక్ష్మ పోషకాలు వినియోగించవచ్చని మండల వ్యవసాయ అధికారిణి బి.సుధారాణి తెలిపారు. మండలంలోని రావిపాడు గ్రామంలో గురువారం ప్రపంచ నేల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేలలో సేంద్రియ ఎరువులు వేసుకోవడం వల్ల నేల స్వభావాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. అనంతరం ఈ సంవత్సరం మట్టి పరీక్షలు చేయించుకున్న రైతులకు భూసార పరీక్ష పత్రాలు అందించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణ పరిశుభ్రత

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పట్టణ పరిశుభ్రతలో ప్రజలు భాగస్వామ్యం కావాలని తెనాలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. స్థానిక 22వ వార్డులో పారిశుద్ధ్య పనులనుకౌన్సిలర్ షేక్ మెహబూబ్ బాషాతో కలసి పరిశీలించారు. మురుగు కాల్వల నిర్వహణ పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలు, చెత్తాచెదారాలనుకార్మికులతో తీయించారు. పట్టణ పరిశుభ్రతే ధ్యేయంగా తెనాలి మున్సిపాలిటీని అభివద్ధి పరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సహాయ కమిషనర్ ఎ.ఎం.లక్ష్మీపతిరావు, వైద్యాధికారిణి హెలెన్ నిర్మల, పట్టణ ప్రణాళికా విభాగం అధికారి ఎం.సాంబశివరావు, సహాయ ఇంజినీరు బి.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షునిగా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లికి చెందిన పొట్టపింజర రాజశేఖర్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు ఆదేశాలు జారీ చేశారు. మంగళగిరిలో గురువారం బుల్లా రాజశేఖర్‌కు నియామక పత్రం అందజేశారు. అనంతరం రాజారావు మాట్లాడుతూ.. నూతనంగా నియమితులైన రాజశేఖర్ జిల్లా కమిటీ తోపాటు నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి వచ్చే సంక్షేమ పథకాలు ఎస్సీ, ఎస్టీలకు అందే విధంగా కృషి చేయాలని సూచించారు.

ఉండవల్లి శ్రీదేవికి సత్కారం

ప్రజాశక్తి- మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఉండవల్లి శ్రీదేవిని గురువారం ఆమె కార్యాలయంలో మంగళగిరి ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు నేరేళ్ల పద్మజ, కార్యదర్శి మాజేటి శ్రీదేవి, కోశాధికారి సంక రాధిక, డాక్టర్ పి.గిరిజ, మాజేటి లలిత, టి.నటరాజకుమారి పాల్గొన్నారు.



దిరిశాల సురేష్ ఆధ్వర్యంలో పడిపూజ

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని వరగాని గ్రామంలో దిరిశాల సురేష్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అయ్యప్ప మాలధారులకు, భక్తులకు అన్నప్రసాద సంతర్పణ చేపట్టారు. కార్యక్రమంలో గురుస్వాములు దిరిశాల నాగేశ్వరరావు, గుంటుపల్లి శ్రీనివాసరావు, దిరిశాల కళ్యాణ్, నాయకులు కూరేటి భూషయ్య, షేక్ కాసింపీరా తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ మల, మూత్ర విసర్జన నిషేధం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి పట్టణాన్ని బహిరంగ మల, మూత్ర విసర్జన రహితంగా తీర్చిదిద్దడానికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గురువారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛ సర్వేక్షన్, స్వచ్ఛభారత్ మిషన్లో భాగంగా దేశ వ్యాప్తంగా స్వచ్ఛతలో మన పట్టణాన్ని ముందంజలో ఉండేవిధంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు,ఉపాధ్యాయులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన వల్ల కలిగే నష్టాలను ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రజారోగ్య పరిరక్షణకు తమ వంతు కషి చేయాలని పిలుపునిచ్చారు. నిబంధనలను అతిక్రమించి పట్టణ పరిదిలో బహిరంగ మల, మూత్ర విసర్జన చేసేవారిపై రూ.500 జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు.

బాల్యవివాహాలు వద్దు.. చదువే ముద్దు

ప్రజాశక్తి - పెదనందిపాడు

పిల్లలకు చదువే ముఖ్యమని.. బాల్యంలోనే వివాహాలు చేయవద్దని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా గురువారం పెదనందిపాడు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో వెలుగు ప్రాజెక్ట్, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిశోరీ బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. వ్యక్తిగత పరిశుభ్రత, విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం గురించి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఎన్.లక్ష్మీ దుర్గ వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం ఎం.సుబ్బారావు, సీసీ బి.శ్రీనివాసరావు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.





అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్

నేడు, రేపు రీజనల్ పాలీటెక్ ఫెస్ట్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక నల్లపాడులోని ఎంబిటిఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో శుక్ర, శనివారాల్లో రీజనల్ టెక్నికల్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.శేఖర్ తెలిపారు. గురువారం కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు ఫెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ టెక్నికల్ ఫెస్ట్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వివిధ కాలేజీల నుండి సుమారు 350 మంది సివిల్, కంప్యూటర్స్, మెకానికల్, ఇతర విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొని వారి నూతన ఆవిష్కరణలు ప్రదర్శిస్తారని తెలిపారు. పారంభోత్సవానికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫ్యాక్టరీస్ జనరల్ సెక్రెటరీ కొమ్మలపాటి శ్రీనివాసరావు తదితరులు హాజరవుతారని తెలిపారు. మొదటి రోజు ఉదయం 10 గంటలకు ఎస్‌వియు రీజనల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్ కుమార్‌ప్రియా పర్యవేక్షణలో వేడుకలు జరుగుతాయని, రెండో రోజు సాయంత్రం నాలుగు గంటలకు బహుమతి ప్రధానోత్సవం మరియు ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు.విద్యార్థులలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీయటానికి టెక్‌ఫెస్ట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పాఠశాల విద్యార్థులు టెక్ ఫెస్ట్‌ను సందర్శించి నమూనాలను పరిశీలించాలని కోరారు.

ఉపాధ్యాయుని మృతి ఘటనపై ఫ్యాప్టో నిరసన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న ఎజాస్ అహ్మద్ మృతిపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ఫ్యాప్టో పల్నాడు జిల్లా చైర్మన్ బి.సంపత్ కుమార్, యుటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్‌రావు డిమాండ్ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని కోరుతూ పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా విద్యా శాఖ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపి డిఇఒ ఎల్.చంద్రకళకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలన్నారు. పాఠశాలలో నైతిక విలువలు పెంపొందే చర్యలు అధికారికంగా చేపట్టే విధంగా మేధావులు, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలతో ప్రభుత్వం చర్చించాలన్నారు. విద్యా సంస్థలు సమీపంలో, విద్యా సంస్థలు ఉన్న పరిసర ప్రాంతాల్లో ఆయా మార్గాల్లో మద్యం దుకాణాలు తొలగించాలని, పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులు పి.ప్రేమ్‌కుమార్, వివిధ సంఘాల నాయకులు ఆర్.గోవిందరాజులు, ఎస్‌ఎం సుభాని, కె.వెంకటేశ్వరరావు,పి.సత్యానందరావు, ఎస్.కె కరిముల్లా, పి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.


పల్నాడు జిల్లా డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

సమగ్ర విచారణ చేపట్టాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-గుంటూరు

రాయచోటి పట్టణంలోని, కొత్తపల్లి ఉర్దూ హైస్కూల్లో సైన్స్ టీచర్ ఎజాస్ అహ్మద్‌పై విద్యార్థులు దాడి చేయడాన్ని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్ రావు, ఎం.కళాధర్ ఒక ప్రకటనలో ఖండించారు. విద్యార్థుల్లో పెరుగుతున్న పెడ ధోరణలు, దురలవాట్లు, నేరప్రవత్తి, అసాంఘిక ధోరణి పెరిగిపోవడం పట్ల ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తముతోందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, అధికారులు, ప్రభుత్వం ఉపాధ్యాయుల్లో ఉన్న ఆందోళనను అర్థం చేసుకొని సరైన చర్యలు తీసుకోకపోతే అసాంఘిక శక్తులుగా మారే ప్రమాదం ఉందని, ఎజాస్ అహ్మద్ మరణంపై న్యాయ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.


ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న ఇరువురు ప్రతినిధులు

విజ్ఞాన్స్, థెరల్లెన్ ఫార్మా మధ్య ఒప్పందం

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ – హైదరాబాద్‌లోని థెరల్లెన్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో థెరల్లెన్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో, మేనేజింగ్ డైరక్టర్ యలమంచిలి శ్రీనివాసరావుతో యూనివర్సిటీ డీన్ పీసీఎఫ్ డాక్టర్ దిరిశాల విజయరాము అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. వీసీ మాట్లాడుతూ ఈ ఒప్పందం వల్ల ఎం.ఫార్మసీ చదివే ఇద్దరు విద్యార్థులకు నెలకు రూ.10 వేలు చొప్పున రెండేళ్ల అందిస్తామన్నారు. ఇలా 2024-25 విద్యా సంవత్సరం నుంచి 2029-30 వరకూ 5 బ్యాచ్‌ల విద్యార్థులకు స్కాలర్‌షిప్స్‌ను అందజేస్తామని తెలిపారు. ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ ఉమ్మడిగా పరిశోధనలు, ఫ్యాకల్టీ ట్రెనింగ్ ప్రోగ్రామ్, అకడమిక్ ట్రెనింగ్ ప్రోగ్రామ్, టెక్నికల్ అసిస్టెన్స్ చేయడంతో పాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లను సులభతరం చేయవచ్చని చెప్పారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడానికి ఉమ్మడి శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు, ఇండస్ట్రీ-అకాడెమియా ఇంటరాక్షన్స్‌ను నిర్వహిస్తామని అన్నారు. వీటితోపాటు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం, ప్రాక్టికల్ ఇండస్ట్రీ అనుభవాన్ని అందించడంతో పాటు వృత్తిపరమైన వృద్ధిని పెంపొందిస్తామన్నారు. ప్రస్తుతం పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం, వాటికి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ఉమ్మడిగా కృషి చేస్తామని తెలిపారు. యలమంచిలి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధ్యాపకులను, విద్యార్థులను సరికొత్త టెక్నాలజీ వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాల్లో తర్ఫీదునివ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు.


శ్రీకృష్ణను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

ఏషియన్ యోగా ఛాంపియన్‌షిప్‌కు భాష్యం విద్యార్థి

ప్రజాశక్తి-గుంటూరు : విద్యార్థులను చదువుతోపాటు వారు ఎంచుకున్న రంగాల్లో ప్రోత్సహించటం ద్వారా ఉన్నత స్థాయికి ఎదుగుతారని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. విజయవాడ అశోక్ నగర్ భాష్యం స్కూల్లో 9వ తరగతి చదువుతున్న ధీరజ్ శ్రీకృష్ణ ఇటీవల హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన యోగా చాంపియన్‌షిప్‌లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి మెడల్ సాధించాడని తెలిపారు. తద్వారా సంగపూర్‌లో ఏషియన్ యోగా ఫెడరేషన్ ఆధ్వర్యంలోని యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ తరపున జనవరిలో 6 నుండి 8వ తేదీ వరకూ జరిగే 10వ యోగా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌కు భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించేందుకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా భాష్యం రామకృష్ణ ధీరజ్ శ్రీకృష్ణను అభినందిస్తూ ప్రోత్సహకంగా రూ.లక్ష చెక్కును అందజేశారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిచారు.

వెహికిల్ షెడ్‌ను సందర్శించిన నగర కమిషనర్


సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ వెహికిల్ షెడ్‌లోని డ్రైవర్లు అంకిత భావంతో విధులు నిర్వహించాలని, నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు గురువారం స్థానిక కెవిపి కాలనిలోని జిఎంసి వెహికల్ షెడ్‌ని విభాగాధిపతులతో కలిసి పరిశీలించి, షెడ్‌లోని వాహనాల డ్రైవర్ల రోజువారి పనివిధానం పై సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత డ్రైవర్ల హాజరుని పరిశీలించారు. నగరంలో ప్రతి రోజు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను తరలించే వాహనాల డ్రైవర్లు అంకిత భావంతో విధులు నిర్వహిస్తే క్లీన్ గుంటూరు సాధ్యమవుతుందన్నారు. సకాలంలో చెత్తను తరలించాలని, వాహనాల జాప్యం వలన పలు ప్రాంతాల్లో వ్యర్థాలు రోడ్ల మీద అస్తవ్యస్తంగా ఉండి ప్రజలకు అసౌకర్యంగా ఉంటుందన్నారు. వాహనాలకు కేటాయించిన ఆయిల్‌లో అవకతవకలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, విచారణలో నిర్ధారణ అయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కష్ణయ్య, సిటి ప్లానర్ రాంబాబు, ఈఈ సుందర్రామిరెడ్డి, సిఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి పాల్గొన్నారు.

నగరాన్ని గ్రీన్ గుంటూరుగా తీర్చిదిద్దాలి..

నగరంలోని పార్కులు, ప్రధాన, అంతర్గత రహదారులు పచ్చదనంతో ఉండేలా పార్క్ అధికారులు, కార్మికులు కషి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. హార్టికల్చర్ సిబ్బంది ఇతర విధుల్లో ఉంటే వారిని వెంటనే వెనక్కు పిలిచి పార్కుల విధులు కేటాయించాలన్నారు. గురువారం జిఎంసి కౌన్సిల్ హాల్లో నగరంలో పచ్చదనం పెంపు, కార్మికుల పనివిధానంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని రానున్న కాలంలో పచ్చదనంతో కూడిన గ్రీన్‌గుంటూరుగా మార్చాలని, అందుకు తగిన విధంగా పార్కులు, ప్రధాన, అంతర్గత రహదారుల్లో మొక్కలను విరివిగా నాటి సంరక్షించాలని ఆదేశించారు. ప్రతి కార్మికునికి ఐరిష్ ద్వారా తీసుకున్న హాజరు మేరకే జీతాలు వేయాలని, అలాగే పార్కుల వారీగా సంబంధిత వార్డు సచివాలయ కార్యదర్శుల ద్వారా హాజరు తీసుకోవడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రధాన రహదారుల వెంబడి ఉన్న సెంట్రల్ మీడియన్స్ అభివద్ధిపై ప్రత్యేక దష్టి సారించాలని, మీడియన్స్‌లో మొక్కలను అందంగా ట్రిమ్మింగ్ చేయాలన్నారు.

అధునాతన సౌకర్యాలతో తేజ ఫార్చ్యూన్ హోమ్స్

ప్రజాశక్తి-గుంటూరు : అధునాతన సౌకర్యాలతో కష్టమర్లకు ఇళ్లు నిర్మించి అందించటానికి ఎల్లప్పుడు ముందుంటామని తేజ ఇన్‌ఫ్రా డెవలపర్స్ మేనేజింగ్ పార్టనర్ యశ్వంత్‌రెడ్డి అన్నారు. ఇటీవల గుంటూరు శ్యామలా నగర్‌లో పూర్తయిన విల్లాస్ ప్రాజెక్ట్ 'తేజ ఫార్చ్యూన్ హోమ్స్' కస్టమర్లకు అందిస్తున్న సందర్భంగా తేజ ఇన్‌ఫ్రా డెవలపర్స్ మేనేజింగ్ పార్టనర్ యశ్వంత్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో ఇలాంటి మెగా ప్రాజెక్ట్ చేయటం అందులో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజి, అండర్‌గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ, సిసి రోడ్లు, క్లబ్ హౌస్ వంటి అధునాతన సౌకర్యాలతో కష్టమర్లకు అందించటం ఆనందంగా ఉందన్నారు. 26 ఏళ్లకే ఇలాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టు నిర్మించే అవకాశం రావటం అదృష్టంగా భావిస్తున్నానని, ఇలాంటి గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులు మా తేజ ఇన్‌ఫ్రా డెవలపర్స్ నుండి మరెన్నో నిర్మించి ప్రజలకు అందించాలని కోరుకుంటున్నానని తెలిపారు. కష్టమర్లు మాట్లాడుతూ గుంటూరులో మంచి అధునిక టెక్నాలజీతో నాణ్యమైన గృహాలు అందించటం సంతోషంగా ఉందన్నారు.

